క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఓడీచెరువు: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాల ని ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగాఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి ఉత్తప్ప మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశామన్నారు. పెరిగిన నిత్యవసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని వేతనం పెంచాలని కోరారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు

నల్లమాడ: సోషల్ మీడియాలో ఇతరులను రెచ్చగొట్టే లేదా కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ నరేంద్రరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో పేకాటరాయుళ్లపై ఇదివరకే కేసులు నమోదు చేసి బైండోవర్ చేసినా వారిలో మార్పు రాలేదన్నారు. ముఖ్యంగా పేకాట ఆడించినా, ప్రోత్సహించినా అటువంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని, జిల్లా బహిష్కరణ చేయడం ఖాయమన్నారు. ఎక్కడ పేకాట జరుగుతున్న 100కు, తన సెల్ నెంబర్ 9440901850 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ పేర్కొన్నారు.

ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీకి సన్మానం



గౌస్‌లాజమ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: శ్రీ సత్యసాయి జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీగా ఎన్నికైన కట్టుబడి గౌస్ లాజమ్‌ను మండల కేంద్రంలో గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తంగేడుకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటాచలమయ్య గౌస్‌లాజమ్ సేవలను కొనియాడారు. గౌస్ లాజమ్ మాట్లాడుతూ డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు గణేష్, టోపివలి, సుధాకర్, సోమశేఖర్ నాయక్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు

ఈ-కేవైసీ తప్పనిసరి

ఓడీచెరువు: మండలంలోని రేషన్ లబ్ధిదారులందరూ సంబంధిత డీలర్ల వద్ద తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ అనంతాచారి, సీఎస్‌డీటీ విజయనిర్మల పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్ల సమావేశం నిర్వహించారు. మండలంలోని డీలర్లందరూ ఈ నెలాఖరు లోగా రేషన్ లబ్ధిదారులతో ఈ-కేవైసీ పూర్తి చేయించాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని లబ్ధిదారులను రేషన్ కార్డు నుంచి తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

ఉచిత వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన దృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్ రూ.11 లక్షలు తన సొంత దబ్బుతో తన తాత, నానమ్మలైన బత్తల గంగన్న, బత్తల గంగులమ్మ జ్ఞాపకార్థం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ప్లాంట్‌ను తన తల్లిదండ్రులైన మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ దంపతులతో ప్రారంభింపజేశారు. వాటర్ ప్లాంట్‌తో పాటు తాగునీటి వాటర్‌క్యాన్‌లు సైతం ప్రజలందరికీ పంపిణీ చేశారు. వేసవి ఎండలతో తీవ్ర తాగునీటితో ఇబ్బందులు పడే సమయంలో వైఎస్సార్‌సీపీ నేత ఇలా మినరల్ వాటర్ క్యాన్‌తో పాటు ఉచితంగా శుద్ధజలాలు అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డా. బత్తల రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ మణికంఠనాయక్, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, ఏసు, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్యాంపులు

పుట్టపర్తి టౌన్: ఈనెల 18 నుంచి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి ఉదయభాస్కర్ తెలిపారు,. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 15 క్యాంపులు నిర్వహిస్తామని, ఒక్కో క్యాంపులో 25 మంది బాలురు, 25 మంది బాలికలు ఉంటారన్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 9849421462పోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

నష్టాల బాటలో మామిడి రైతులు

- ఎండతీవ్రతకు రాలిపోతున్న కాయలు
- ఈదురు గాలులు, వడగండ్ల వానలపై రైతుల ఆందోళన



ఏలుకుంట్ల వద్ద కాయలు లేని మామిడి తోట

ధర్మవరం రూరల్: మార్కెట్‌లో మామిడి పంటకు మంచి ధరలు ఉన్నప్పటికీ దిగుబడులు లేక మామిడి రైతులు నష్టపోతున్నారు. తమకు భరోసా కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. 40 డిగ్రీల సెంటీగ్రేడ్ పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ఎండ తీవ్రతకు మామిడి కాయలు ఉన్నఫలంగా రాలిపోతున్నాయి. ఈ ఏడాది ఆశించిన మేర లేక పంట లేక దిగాలుగా ఉన్న రైతులు మరో పక్క ఎండ వేడితో కాయలు రాలిపోతుండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.

భయపెడుతున్న ప్రకృతి

గతేడాది చివరిలో వర్షాలు కురవడంతో మామిడి తోటల్లో పూత చాలా ఆలస్యంగా వచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో దాదాపుగా పంటలు కోతకు వస్తాయి. అయితే ఈ ఏడాది పూత ఆలస్యం కావడంతో చాలా చోట్ల మే నెలలో పంట కోతకు వచ్చే అవకాశముంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాల్లో ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయంటూ వాతావరణ శాఖ వారు ప్రకటనలు చేస్తుండడంతో మామిడి రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టినా అసలే అంతంత మాత్రంగా ఉన్న పంట దిగుబడులు ఈదురు గాలులు వీస్తే ఏమవుతాయోనని చెబుతున్నారు.

ధర్మవరం డివిజన్‌లో మామిడి సాగువివరాలు..	
మండలం	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
ధర్మవరం	1,045
బత్తలపల్లి	305
తాడిమర్రి	458
ముదిగుబ్బ	2,525
కనగానపల్లి	948
చెన్నేకొత్తపల్లి	830
రామగిరి	395

భరోసా ఇవ్వని పంటల బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నష్టపోయిన చినీ, అరటి తదితర రైతులకు బీమా సౌకర్యం కల్పించి ఆదుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చినీ, అరటి రైతులు పూర్తిగా నష్టపోయినా కూటమి ప్రభుత్వం ఆదుకునే దిశగా చర్యలు చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. ఎకరానికి రూ.1800 ప్రీమియం చెల్లించాలని ప్రకటించింది. అది కూడా బీమాను జిల్లా యూనిట్‌గా తీసుకుంటారా? లేక మండలం యూనిట్‌గా తీసుకుంటారా అనేది స్పష్టత లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు ప్రీమియం చెల్లించలేకపోయారు. ప్రీమియం మొత్తం ఎక్కువగా ఉండడంతో చాలా మంది బీమా చేయించుకోలేకపోయినట్లు తెలుస్తోంది.

చెట్లల్లో కాపు కనిపించడం లేదు



మామిడి తోటల్లో కాపులు లేకపోవడంతో ఈ ఏడాది పంట కోసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. ఏటా మామిడి దిగుబడితో రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చేది. పూతలు ఆలస్యంగా రావడం, వాతావరణంలో మార్పుల కారణంగా పూతలు రాలిపోయింది. పెద్ద చెట్లు అయిన కాయలు నామమాత్రంగా ఉన్నాయి. నాకు 280 చెట్లున్నాయి.

– నారాయణరెడ్డి, మామిడి రైతు, బుద్దారెడ్డిపల్లి

ధర ఉన్నా దిగుబడి లేదు



మామిడికి మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్నాయి. ఇలాంటి సమయంలో దిగుబడులు ఉండి వుంటే బాగా ఆదాయం వచ్చేది. ఎండలకు కాయలు వున్న ఫలంగా రాలిపోతున్నాయి. తోటల్లో కాపు రావడానికి ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాను. ఖర్చు పెట్టిన డబ్బు కూడా చేతికందే పరిస్థితి లేదు.

– రమేష్, మామిడి రైతు, ఏలుకుంట్ల

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ధర్మవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ ఆయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని కనీస వేతనం అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. అయితే ఎన్నికల అనంతరం కార్మికులకున్న ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టు పద్ధతిని అమలు చేయాలని యత్నించడం సరికాదన్నారు. కార్మికులకు నష్టం జరిగే విధానాలు తీసుకొస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. చనిపోయిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని దాదాపు మూడేళ్లుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి ముకుంద, లక్ష్మీ ఓబులేసు, ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గునాగరాజు, కార్యదర్శి జయ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం పంపిణీ



మహిళా రైతుకు నగదు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: దాడితోట గ్రామ సమీపంలోని కొండపై ఆదాని కంపెనీ చేపట్టిన గ్రీన్ ఎనర్జీ పనులతో పంట నష్టపోయిన రైతులకు గురువారం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పంట నష్టపరిహారం పంపిణీ చేశారు. కొండపైన చేపట్టిన జేసీబీ, హిటాచీలతో చేపట్టిన మట్టి తవ్వకాల వల్ల సమీప పొలాలపై దుమ్ము చేరిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన అధికారులను పంపి పంట నష్టం అంచనా వేసి నివేదికను ఆర్డీఓకి పంపారు. ఆర్డీఓ ఆదేశాలతో రైతులకు తాత్కాలిక ఉపశమనం కింద 65 ఎకరాలకు సంబంధించి, 17 మంది రైతులకు రూ.11 లక్షల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యానవన అధికారులు పంటనష్టం అంచనా వేయడానికి నివేదికను ల్యాబ్‌కు పంపావని అవి రావడానికి రెండు నెలలు పడుతుందన్నారు. ఆ నివేదిక రాగానే మరోసారి రైతులకు పంటనష్టం అందిస్తామని ఆయన వివరించారు. అదానీ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కదిరి అర్బన్: ఉద్యోగులకు భద్రత కల్పించినపుడే సంస్థ అభివృద్ధి చెందుతుందని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద సర్క్యులర్ 1-19ను అమలు చేయాలని ప్ల కార్డులు పట్టుకుని ఉద్యోగులు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు ఊడుతుందోనని అభద్రతా భావంతో విధులు నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌తో పాటు అరియర్స్, నైట్ అవుట్ అలవెన్సులు, గ్యారేజీ కార్మికులకు పనిముట్లు, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ లీవులు తదితర డిమాండ్లను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, వహీదాబేగం, రామచంద్ర, శ్రీనివాసులు, శ్రీరాంనాయక్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ అమలు చేయాలన్నారు. విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యతను ఆర్టీసీ సిబ్బంది ఇవ్వాలన్నారు. అసోసియేషన్ రీజనల్ అధ్యక్షులు శ్రీరాంనాయక్, కార్యదర్శి షబ్బీర్, ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, డిపో చీఫ్ అడ్వైజర్ అప్పిరెడ్డి, ప్రెసిడెంట్ శివశంకర్, నాయకులు గయాజ్‌బాషా, గంగులయ్య, లక్ష్మీపతి, విజయలక్ష్మి, రాజగోపాల్, రవితేజ, చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌యూ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం: మే 9 నుంచి తివేంద్రంలో జరిగే ప్రగతిశీల విద్యార్థి సంఘం(పీఎస్‌యూ) నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర కోరారు. పట్టణంలోని బీసీ హాస్టల్ వద్ద గురువారం జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నూతన జాతీయ విద్యా విధానం ఏకపక్షంగా అమలు చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మేస్తోందని విమర్శించారు. బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని విద్యార్థి, యువతపై ఉందన్నారు. ప్రభుత్వ విద్య, దేశాన్ని కాపాడుకుందామని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, బీజేపీకి వ్యతిరేకంగా భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను రూపొందించుకోవడానికి ఈ మహాసభలు వేదిక అవుతాయన్నారు. మహాసభలకు ప్రతి విద్యార్థి తరలిరావాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నందకిశోర్, నాయకులు ప్రశాంత్, గిరీష్, మహేంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: దాడి ఘటనలో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వివరాలు. ముదిగుబ్బ మండలం కొట్టాలకు చెందిన శేఖర్‌కు కారు కుదువపెట్టి డబ్బు తీసుకున్న విషయంలో యర్రదొడ్డి గ్రామానికి చెందిన కిరణ్‌తో గొడవ జరిగింది. దీంతో కిరణ్ తన స్నేహితులు రాజు, పవన్‌లో కలిసి శేఖర్, అతని స్నేహితుడు శ్రీకాంత్‌పై దాడి చేశారు. శేఖర్ ఫిర్యాదు మేరకు కిరణ్‌తోతోపాటు అతడి స్నేహితులిద్దరిపై రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

ఓడీచెరువు : ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద కూలీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ వలసలు నివారించేందుకు పనులు కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే కూలీలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. పనిచేసే చోట నీడ,నీరు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ కింద పండ్ల తోటలు సాగుచేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని వారికి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతి, నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు

శ్రీహరి కోటను సందర్శించిన విద్యార్థులు



అంతరిక్ష కేంద్రంలో గాండ్లపెంట విద్యార్థినులు

గాండ్లపెంట: జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో సైన్స్ డే సందర్భంగా పుట్టపర్తిలో నిర్వహించిన ప్రయోగాల్లో ప్రతిభ కనపరిచిన గాండ్లపెంట ఉన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఓబుళరెడ్డి, రాజరత్నం విద్యార్థులకు అంతరిక్ష కేంద్రంలో చేపట్టే వివిధ రకాల ప్రయోగాలను సంబంధించి అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సదాఫ్, లిఖిత, షమ ఫిర్దోస్, మోక్షిత, నీహ తబుస్సుం, గీతిక, పూజిత పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష అదనపు సమన్వయకర్త దేవరాజు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఇంటర్‌కు సంబంధించి మెరుగైన ఫలితాలు సాధించాలని ఏపీ సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త దేవరాజు పేర్కొన్నారు. గురువారం బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లాలోని 30 కేజీబీవీల ఎస్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 30 కేజీబీవీల్లో కేవలం 12 మాత్రమే 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. వచ్చే ఏడాది అన్ని కేజీబీవీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి విద్యార్థినికీ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

టిప్పర్ల పట్టివేత

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో బుధవారం రాత్రి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి పట్టుకున్నారు. వాటిని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మహాత్మాగాంధీకాలనీలో నివసిస్తున్న మల్లిపోగుల శ్రీనివాసులు రెండు కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితమైన విషయంపై ఈనెల 10న 'తండ్రి కోసం తనయ పోరాటం' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శివలింగన్న, కోశాధికారి సుధాకర్ గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు.

సంక్షిప్త సమాచారం

రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: నాగలూరు వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ స్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్‌కు విద్యార్థులు మారే రోజున ఈ గ్రాడ్యుయేషన్ డే జరుపుకుంటారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ సంవత్సరం కలిసి చేసిన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. ప్రీ ప్రైమరీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'భూమన హౌస్ అరెస్ట్ సరికాదు'

పుట్టపర్తి టౌన్: తిరుపతి గోశాలలో గోవులు మరణిస్తున్నాయన్న విషయాన్ని ఆధారాలతో సహా పత్రికలు, మీడియా ద్వారా తెలియజేయడానికి వెళ్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు సవాల్‌ను స్వీకరించి గోశాల వద్దకు వెళ్తున్న కరుణాకర్‌రెడ్డిని గృహ నిర్బంధం ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు మానుకోకపోతే ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తాడిమర్రి: దాడితోట గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డి లింగారెడ్డి కుమారుడు వడ్డి సుదీర్‌రెడ్డి గురువారం ఉదయం తమ పొలం వద్దకు బైక్‌పై బయలుదేరాడు. కాటికోటేశ్వర క్షేత్రం రహదారిలో రోడ్డు పక్కన ఉన్న ఓ పొలానికి మట్టిని తరలిస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడిని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీసీలకు వెన్నుపోటు పొడిస్తే సహించం

బత్తలపల్లి: బీసీల ఓట్లతో గద్దెనెక్కి అధికారం వచ్చిందన్న అహంభావంతో బీసీలను వెన్నుపోటు పొడిస్తే సహించబోమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశన శంకర్‌రావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారు కష్టజీవులని వారిని ఆధిపత్యపు కులాలవారు, అగ్రకులాల వారు హింసించడం, దాడులకు పాల్పడడం చేస్తే సహించబోమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు నామాల శంకర, జిల్లా నేతలు మహేష్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డె తిరుపతయ్య, ప్రజా సంఘాల నాయకులు సాకే లక్ష్మన్న, ఎరుకల వెంకటనారాయణ, రామాచారి, చాకల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నల్లచెరువు: మండల పరిధిలోని ఓరువాయి గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.21,060 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు.

విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయండి

పుట్టపర్తి టౌన్: విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన రైతులు కాటమయ్య, లింగప్ప, వెంకటేష్, శివయ్య అధికారులను కోరారు. గురువారం వారు స్థానిక ఎస్ఈ కార్యాలయానికి వచ్చారు. అయితే ఎస్ఈ లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డీడీలు చెల్లించి రెండేళ్లయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని వాపోయారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి

కనగానపల్లి: మండలంలోని బాలేపాళ్యం, నెమలివరం, యలకుంట్ల గ్రామాల్లో పలుచోట్ల ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరిగాయి. స్థానిక రైతులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి మండలంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అరటి తోటలు ఎక్కువగా ఉన్న బాలేపాళ్యం, నెమలివరం, యలకుంట్ల గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో కోతకు వచ్చిన అరటి మొక్కలు కింద పడిపోయాయి. దీంతో ఒక్కో ఎకరానికి రూ.30 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతులు పెద్దిరెడ్డి, ముత్యాలు, నారాయణ, రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు దెబ్బతిన్న పంటలు పరిశీలించి ప్రభుత్వం నుంచి తగు నష్టపరిహారం అందించాలని కోరారు.

'పరీక్షల్లో వచ్చే మార్కులే జీవితం కాదు'

చెన్నేకొత్తపల్లి: విద్యార్థినులు పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామని మనోవేదనకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని శ్రీసత్యసాయి జిల్లా కౌన్సిలర్ ఎవిలిన్ కేరన్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం రామగిరి, కనగానపల్లి, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని కేజీబీవీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కౌన్సిలర్ మాట్లాడుతూ.. కష్టపడి చదవాలని సూచించారు. అయితే చిన్నచిన్న కారణాలతో మనోధైర్యాన్ని కోల్పోయి క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోరాదన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని డీఎఫ్ఓ నాగరాజు నాయక్ విద్యార్థులకు సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని మాపక ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా బయటపడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.